క్లుప్తంగా

ఘనంగా రెడ్‌క్రాస్ దినోత్సవం



గుడివాడ టౌన్: రక్తదానం చేసి ప్రాణదాతలు అవ్వాలని రెడ్‌క్రాస్ సొసైటీ గుడివాడ శాఖ చైర్‌పర్సన్ చలసాని స్పందన అన్నారు. మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రెడ్‌క్రాస్ సొసైటీ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. అందులో ప్రధానమైనది రక్తదానాన్ని ప్రోత్సహించడం, ఆవశ్యకతను సమాజానికి తెలియచెయ్యడం ప్రధాన అంశం అన్నారు. వీటితో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వాటిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ఎక్కువసార్లు రక్తదానం చేసిన మడక అన్వేష్, ధనాల రాజ్‌కుమార్, సమరం, వి.శ్రీరామ్‌లకు రెడ్‌క్రాస్ సభ్యత్వం ఇస్తూ వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ శాఖ ఉపాధ్యక్షుడు మడకా ప్రసాద్, కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, కోశాధికారి పునీత్, సభ్యులు కె.అనూరాధ, షమీర్, షేక్ జానీ సాహెబ్, ఎం.శివనాథ్, తదితరులు పాల్గొన్నారు.

12న పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ

బ్రోచర్‌ను ఆవిష్కరించిన బీసీ సంఘ నేతలు

గుడివాడ టౌన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మ జ్యోతీరావ్‌పూలే, సావిత్రీ బాయ్‌పూలే చేసిన కృషి చిరస్మరణీయం అని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్, మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి అన్నారు. స్థానిక ఆంజనేయ ఫంక్షన్ హాలులో మంగళవారం బీసీ సంఘం గుడివాడ నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈనెల 12వ తేదీ స్థానిక మెయిన్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల కాంస్య విగ్రహాల ఆవిష్కరణ జరుగుతుందన్నారు. రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చేతులమీదుగా ఈ ఆవిష్కరణ ఉంటుందన్నారు. తొలుత పట్టణంలో భారీ ర్యాలీ అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలని కోరారు. విగ్రహావిష్కరణ బ్రోచర్‌లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు మల్లేశ్వరరావు, నాయకులు టీవీ రమణకుమార్, యామినీదేవి, డి.కృష్ణ, టి.రమేష్, జి.గోవర్ధన రావు, ఎస్.రంగారావు, సీహెచ్.సత్యన్నారాయణ, మూడెడ్ల ఉమ, ఎం.రాణి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తనివ్వం

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



చినతాడినాడలో చెరువు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ప్రజాప్రతినిధులు

కైకలూరు (కలిదిండి): వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా నియోజకవర్గంలో ముందస్తు చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. చినతాడినాడ పంచాయతీ శివారు విభరాంపురంలో రెండు ఎకరాల చెరువులో నీటి పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. సర్పంచ్ గండికోట ఏసుబాబు మాట్లాడుతూ సమీప పశ్చిమగోదావరి జిల్లా ఐ.భీమవరం నుంచి 7 కిలోమీటర్ల దూరంలో తాడినాడ, చినతాడినాడ గ్రామాలకు పైపులైన్లను ఏర్పాటు చేసి నీటిని పంపిణీ చేస్తున్నారన్నారు. విభరాంపురం గ్రామంలో 300 కుటుంబాలకు తాగునీటి చెరువు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. పైపులతో నీటి సరఫరా దాదాపు పూర్తయ్యిందని తెలిపారు. ఎమ్మెల్యే డీఎన్నార్ కృషిని ప్రజలందరూ హర్షిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గారాణి, పీఏసీఎస్ అధ్యక్షులు సాగి చిన్నబ్బాయి రాజు, పామర్తి సత్యనారాయణ, మేక హరికృష్ణ పాల్గొన్నారు.

ఆటపాక నిర్మాణం పరిశీలన..

కైకలూరు మండలం ఆటపాకలో కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే డీఎన్నార్ పరిశీలించారు. త్వరగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. పనులు నాణ్యతగా చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్నా రమేష్, సింగంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులు ప్రారంభం



పొలంలో వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

పామర్రు: వేసవి దుక్కులు ప్రారంభమయ్యాయి. ఇటీవల వరుసగా వర్షాలు కురిసి భూమి మెత్తబడింది. మళ్లీ ఎండలకు ఎండిన భూమి దుక్కులకు అనువుగా ఉంటుంది. దీంతో రైతులు దుక్కి దున్నే పనులను ప్రారంభించారు. రబీ పంట తర్వాత వేసవి కాలంలో మెట్ట, మాగాణి, బీడు భూముల్లో లోతు దుక్కులు దున్నుకోవాలి. వీటినే వేసవి దుక్కులు, ఎండు దుక్కులు అంటారు. ఈ దుక్కులను 25–30 సెంటీ మీటర్ల లోతు వరకూ దున్నాలి. ఇలా చేయడం వలన భూమిలోని గడ్డి పొరలు చీలిపోతాయి. అధిక వర్షాల సమయంలో గుల్లబారి నీరు ఇంకిపోతుంది. నేలలో నీటి నిల్వల సామర్థ్యం పెరుగుతుంది. భూమి లోపల పొరల్లోని కలుపు విత్తనాల వేర్లు బయటపడి వేసవిలోని అధిక ఉష్ణోగ్రతలకు ఎండి జీవం కోల్పోతాయి. సేంద్రియ పదార్థాల లభ్యత పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

పచ్చిరొట్ట పైర్లతో భూమికి సారం..

రబీ పంట అనంతరం, వేసవి దుక్కుల తర్వాత నీటి వసతిని బట్టి పెసర, మినుము పంటలను సాగు చేసుకోవచ్చు. పిల్లి పెసర, జనుము వంటి పైర్లను సాగు చేసుకోవచ్చు. చౌడు నేలలో పచ్చిరొట్టసాగు జీలుగ సాగు మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. జనుము, పిల్లి పెసర, జీలుగ పైర్లను వేసి అవి పూత దశకు రాగానే తొలకరి వర్షాలు పడేసమయంలో భూమిలో కలియ దున్నాలి. దీని వలన భూమిలో సారం పెరిగి ఖరీఫ్, రబీలో వేసే పంటల పెరుగుదలకు దోహదపడుతుంది.

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి శిక్షణ



విద్యార్థులకు దేశభక్తి గీతాలు నేర్పుతున్న వెంకటేశ్వరరావు

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ కొనసాగుతోంది. మంగళవారం ప్రముఖ కళాకారుడు అవిర్నేని వెంకటేశ్వరరావు తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. దేశభక్తి గీతాలను నేర్పించారు. నందివాడ మండలం రుద్రపాక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, పుస్తక సమీక్ష, ఆటలు వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారిణి జె.విజయలక్ష్మి తెలిపారు. పరిసర ప్రాంత చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పామర్రు: పుస్తక పఠనం వలన విద్యార్థులలో ఎంతో విజ్ఞానం పెంపొందుతుందని పామర్రు శాఖ జిల్లా గ్రంథాలయ అధికారి ఎం. ఝాన్సీరాణి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం చదువుపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. నీతికథలు చెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి గ్రేడ్–3 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం మంగళవారం రెండో రోజు కొనసాగింది. స్టోరీలు చదవడం, రీజనింగ్ తదితర విషయాలను గ్రంథాలయాధికారి షేక్ పరీన్ పిల్లలకు చెప్పారు. జూన్ 11వ తేదీ వరకు 40 రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. పిల్లలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుడ్లవల్లేరు: పుస్తక పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞాన సముపార్జన చేకూరుతుందని గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. మంగళవారం అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠన పోటీలను చేపట్టారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు దృష్టి సారించాలని గ్రంథాలయాధికారులు కోరారు.

పామర్రు(జమీగొల్వేపల్లి): తెలుగు భాషలో ప్రావీణ్యం సంపాదిస్తే మిగిలిన భాషలు సునాయాసంగా నేర్చుకోవచ్చునని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖగ్రంథాలయంలో వేసవి శిక్షణాశిబిరంలో రెండో రోజు మంగళవారం విద్యార్థులకు పుస్తక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్న నాటి నుంచి క్రమ శిక్షణ అనేది అలవర్చుకోవాలని అన్నారు. గ్రంథాలయంలో నిర్వహించే ఈ వేసవి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ప్రతిభ కనబర్చాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వినాగ సురేష్, గ్రంథాలయ పాఠకులు, విద్యా ర్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామని విద్యుత్ శాఖ ఈఈ డి.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం నుంచి దరఖాస్తు చేసుకున్న వెంటనే కనెక్షన్లు ఇస్తామన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని విద్యుత్ ఉపకేంద్రం (సబ్ స్టేషన్) వద్ద లబ్ధిదారులు పేర్లను నమోదు చేసుకోవాన్నారు. ప్రతి లబ్ధిదారుడు మున్సిపల్ కమిషనర్ మంజూరు చేసిన ఎలాట్‌మెంట్ పత్రం, ఆధార్ కార్డు, ఒక పాస్ పోర్టు సైజ్ ఫొటో, సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.400, దరఖాస్తు ధర రూ.50 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు

పామర్రు: స్థానిక అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిధిలో 2022–23వ ఏడాదిలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 10 మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందించనున్నట్లు ఘంటసాల కళాపీఠం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కాటూరి వెంకట మురళీకృష్ణ కోటి పాండురంగారావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు, పమిడిముక్కల మండల ఎంఈవోలు పి.విజయలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కళాపీఠం సభ్యులు కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాహనాలు నడపడంలో నిర్లక్ష్యం తగదు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడరూరల్: వాహనాలు నడపడంలో డ్రైవర్లు నిర్లక్ష్యం వహించవద్దని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ సూచించారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని, ఎవరూ నిర్లక్ష్యంగా ఆటోలు నడపవద్దని, ప్రజల ప్రాణాలను కాపాడాలని సూచించారు. మీపై కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయనే విషయాన్ని డ్రైవర్లు గుర్తించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ నియమాలు పాటించి తమకు సహకరించాలన్నారు. సమావేశంలో వన్, టూటౌన్, రూరల్ సీఐలు గోవిందరాజులు, బి.తులసీధర్, కేఎస్‌వీ జయకుమార్, ట్రాఫిక్, వన్, టూటౌన్, రూరల్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నూతన డీఎస్పీని కలసిన ఎన్జీవో సంఘ నేతలు..

గుడివాడ నూతన డీఎస్పీ పి.శ్రీకాంత్‌ను గుడివాడ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఫరీద్‌బాషా, జి.రాజేంద్రప్రసాద్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీస్ శాఖ నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి ప్రభుత్వ ఉద్యోగులుగా తాము అన్ని విధాలుగా సహకరిస్తామని డీఎస్పీశ్రీకాంత్‌కు వారు వివరించారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులను అందిస్తున్న అతిథులు రమణబాబు, శ్రీధర్

గుడ్లవల్లేరు: పాలిటెక్నిక్ విద్యలో విజయాలకు గుడ్లవల్లేరు ఏఏఎన్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ పుట్టినిల్లు అని ఏపీ ఎస్‌బీటీఈటీ సెక్రటరీ కె.వి.రమణబాబు అన్నారు. సోమవారం రాత్రి నిర్వహించిన స్థానిక పాలిటెక్నిక్ 42వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిప్లమా అయిన తర్వాత విద్యార్థులు ఉద్యోగాల వైపు దృష్టి సారిస్తే ఆదాయం కూడా గడించి దేశాభివృద్ధికి తోడ్పడవచ్చునని పేర్కొన్నారు. హైదరాబాద్ ఆర్ఎంఎస్ఐ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా వారి నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కాలేజీ చైర్మన్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపాల్ జి.వి.వి.సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ మంత్రి రాక

గుడివాడ టౌన్: రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పట్టణానికి బుధవారం విచ్చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు విజయవాడ కార్యాలయం నుంచి బయలుదేరి 9.30 గంటలకు పట్టణంలో నూతనంగా నిర్మించిన మల్లాయిపాలెం లే–అవుట్ టిడ్కో గృహ సముదాయాలను పరిశీలిస్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి రాక సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లు ఆయన పరిశీలిస్తారని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నాకౌట్ క్రికెట్ టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నట్లు స్టేడియం సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పాల్గొంటారు. క్రికెట్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేత్ర దానం

గుడ్లవల్లేరు: స్థానిక పొట్లూరి అచ్చయ్య ధర్మసత్రం ధర్మకర్త పొట్లూరి నరసింహారావు మంగళవారం మృతి చెందారు. ఆయన కోరిక మేరకు తాడిగడప ఎల్వీ రావు ఆసుపత్రి వైద్యులు భౌతిక ఖాయం నుంచి కార్నియాలను సేకరించారు. వీటిని భద్రపరచి అవసరంలో ఉన్న వారికి దానం చేయనున్నారని గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ చైర్మన్ శింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. నరసింహారావుకు 97 ఏళ్ల వయసున్నా ఆయన కళ్లజోడు లేకుండా నిత్యం పేపర్ చదివేవారని ఆయన చెప్పారు. లయన్స్ ప్రతినిధులు పొట్లూరి రవి, వై.పి.సి.ప్రసాద్, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

చినపారుపూడి(పెదపారుపూడి): మండలంలోని చినపారుపూడి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరుగుతున్న పేకాట శిబిరంపై దాడులు నిర్వహించినట్టు పామర్రు స్పెషల్ బ్రాంచ్ సీఐ పెద్దిరాజు మంగళవారం తెలిపారు. గత కొద్ది రోజుల నుంచి గ్రామంలో పేకాట యథేచ్ఛగా జరగటంతో ప్రత్యేక పోలీస్ సిబ్బంది సోమవారం రాత్రి నిఘాపెట్టి పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో 11 మంది జూదారులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.49 వేలు నగదు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేస్తున్నారు. జూదారులను అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు పామర్రు స్పెషల్ బ్రాంచ్ సీఐ పెద్దిరాజు పేర్కొన్నారు.

'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థికి సత్కారం



విద్యార్థి యువసాయిని సత్కరిస్తున్న ఎంపీపీ శ్రీరామదుర్గాప్రసాద్, సర్పంచి

మండవల్లి: 10వ తరగతి పరీక్షల్లో డివిజన్ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. చెల్లేటి యువసాయి 585 మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందాడు. 545 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన గొర్రిపర్తి కుసుమ, 528 మార్కులతో తృతీయ స్థానం సాధించిన గంగుల జగదీష్, 524 మార్కులు పొందిన గంగునేని సాయి, 519 మార్కులు సాధించిన గంగునేని లిఖిత్ శివమణి, 501 మార్కులు సాధించిన ముచ్చర్ల జయశ్రీలను అభినందించారు. చేబోయిన వీర్రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, సుధామ పౌండేషన్ విజయ్‌కుమార్, మెండా సురేష్, ముళ్లపూడి సత్తిబాబు, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే 'జగనన్నకు చెబుదాం'



సీఎం వైఎస్ జగన్ ప్రత్యక్ష ప్రసారం తిలకిస్తున్న నాయకులు, అధికారులు

పామర్రు: స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో మంగళవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ 1902 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం వినియోగించుకోవాలని కోరారు. ఎప్పటి కప్పుడు అర్జీ స్టేటస్ ఎస్ఎంఎస్ ద్వారా ప్రజలకు అప్‌డేట్ అందుతుందన్నారు. వైస్ ఎంపీపీఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీడీవో వై.రామకృష్ణ, ఈవోపీఆర్డీ విజయ్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కరించుకోవాలి

పామర్రు (పమిడిముక్కల): 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని పమిడిముక్కల మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుధా ప్రవీణ్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవడంలో ఏమైన ఇబ్బందులుంటే 1902 నంబరుకు కాల్‌చేసి తెలియజేయవచ్చన్నారు. వెంటనే పరిష్కారం లభిస్తుందని అన్నారు. రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలు, అవ్వాతాతలు ఎవరైనా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. మండల వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, రంజాల సీతారామయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు మిర్జా దియానత్ అలీ, ఎంపీటీసీ సభ్యులు గుర్విందపల్లి వంశీ మండల అధికారులు నాయకులు పాల్గొన్నారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

పామర్రు: మండలంలో స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ బుధవారం పర్యటన వివరాలను కార్యాలయ సిబ్బంది మంగళవారం తెలిపారు. ఉదయం 10గంటలకు పమిడిముక్కల మండలం చోరగుడి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఉదయం 11 గంటలకు తోట్లవల్లూరు మండలం యాకమూరు కరకట్ట మీద నూతన చర్చి ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు పామర్రు టౌన్‌లో కంచర్ల వానిపురంలో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆయా మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొనాలని కోరారు.

వైభవంగా శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పామర్రు: స్థానిక తోటలోని శ్రీకోదండ రామాలయంలో శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠా త్రయాహ్నికా మహోత్సవ కార్యక్రమాలు మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. ఆలయంలో పూజాది కార్యక్రమాలను, శాంతి హోమాలను నిర్వహించారు. ఆలయంలో పులి కేశవబాబు, నాగపద్మజ దంపతులు, అల్లంశెట్టి కోటేశ్వరరావు (బలు) జ్యోతి దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. పరాశరం రామకృష్ణామాచార్యులు పాకయాజీ బృందం సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఆలయ అర్చకులు వేదాంతం తాగూర్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు, స్థానికులు భక్తులు పాల్గొన్నారు.